క్లుప్తంగా

చెరుకు తోట దగ్ధం

పుత్తూరు రూరల్: మండల పరిధిలోని తిరుమలకుప్పం గ్రామంలో శనివారం సాయంత్రం చిట్టిబాబునాయుడు చెరుకు తోట దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగినట్లు రైతు తెలిపారు. రెండు ఎకరాల్లో పంట కాలిపోయి, సుమారు రూ.3 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు వాపోయారు. పుత్తూరు అగ్నిమాపక సిబ్బంది వెళ్లి మంటలను అదుపు చేశారు.

వరిలో కలుపు నివారణపై అవగాహన

నిండ్ర: రబీ సీజన్‌లో వరి సాగు చేసే రైతులు పంటలో కలుపు నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలని ఏఓ తులసిరాం అన్నారు. వరిలో కలుపు నివారణపై శనివారం ఆయన అగరం రైతులకు అవగాహన కల్పించారు. పితరాక్లోర్ మందును ఎకరాకు 500 మిల్లీ లీటర్లను ఇసుకలో కలిపి వరి నాటిన 4 రోజుల తరువాత చల్లాలన్నారు. దీంతో వరిలో కలుపు నివారించవచ్చన్నారు. వరిలో కలుపు నివారించడం వల్ల పంట దిగుబడి పెరుగుతుందన్నారు.

రచయిత నామినికి సత్కారం



రచయిత నామినిని సత్కరిస్తున్న ఛాంబర్ ఆఫ్ కామర్స్ నేతలు

తిరుపతి కల్చరల్: వైఎస్ఆర్ జీవిత సాఫల్య పురస్కార గ్రహీత ప్రముఖ రచయిత నామిని సుబ్రమణ్యం నాయుడిని శనివారం తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి, అభినందించారు. ఈ మేరకు రచయిత నామిని స్వగృహంలో ఆయన్ను ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కె.మోహన్‌కుమార్ రాజు,కార్యదర్శి కొల్లె వాసుదేవ్‌లు కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్య ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

తిరుపతి కల్చరల్: శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో శనివారం రాత్రి ఎ.శబరి గిరీష్ గాత్ర కచేరి, ఎ.ప్రభావతి బృందం ప్రదర్శించిన నృత్యాభినయం ఆకట్టుకుంది. శ్రీరామచంద్ర పుష్కరిణి వేదికపై ఎల్.శ్రీనివాస రావు బృందం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

జాతీయ తైక్వాండో పోటీలు ప్రారంభం

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో శనివారం ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో 5వ జాతీయ స్థాయి ఇన్విటేషనల్ తైక్వాండో చాంపియన్‌షిప్–2023 పోటీలు ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు జరిగే ఈ పోటీలకు 7 రాష్ట్రాల నుంచి దాదాపు 200 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. ఈ ప్రారంభోత్సవానికి ఏఎస్పీలు జె.కులశేఖర్, జె.వెంకటరావు ముఖ్యఅతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం వివిధ వయో విభాగాల వారీగా పోటీలను నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు విజయ్‌కుమార్, బాబురావు, ఉపాధ్యక్షులు బి.ఆనందరావు, సహాయ కార్యదర్శి వెంకట్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యతేజం.. ధనలక్ష్మీదేవి దర్శనం

- వైభవంగా దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు
- అమ్మవారి ఆలయాలకు పోటెత్తుతున్న భక్తులు

నగరి: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా శనివారం నగరి పట్టణంలోని దేవీ ఆలయాల్లో అమ్మవార్లకు వివిధ అలంకరణ నయనానందకరంగా అనిపించింది. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు ఆలయాలకు అధిక సంఖ్యలో హాజరయ్యారు. మండలంలోని బుగ్గఅగ్రహారం కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో అన్నపూర్ణాదేవి కాళరాత్రి అలంకరణలో భక్తులను కటాక్షించారు. పట్టణ పరిధిలో కామాక్షిసమేత కరకంఠేశ్వర ఆలయంలోని కామాక్షి దేవికి అర్చకులు దుర్గాప్రకాష్ ప్రత్యేక పూజలు నిర్వహించి సరస్వతీ అలంకరణ చేశారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై కుంకుమ పూజలు చేశారు. ధర్మకర్త సుబ్రమణ్యం ఏర్పాట్లను పర్యవేక్షించారు. కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఉత్సవమూర్తికి ధనలక్ష్మి అలంకరణ చేయగా మూలవర్లకు పిండి అలంకరణ చేశారు. ఈ అలంకరణలు భక్తులను ఆకట్టుకున్నాయి. నత్తంకండ్రిగ కరుమారియమ్మ ఆలయంలో అమ్మవారికి కాత్యాయణి అలంకరణ చేయగా భక్తులు దర్శించుకున్నారు.

అన్నపూర్ణేశ్వరిగా ద్రౌపదీదేవి

పుత్తూరు రూరల్: దసరా ఉత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలోని ఆరేటమ్మ, ద్రౌపదమ్మ, కామాక్షమ్మ, కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో అమ్మవార్లను వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. అన్నపూర్ణేశ్వరిగా ద్రౌపదీదేవి భక్తులను కటాక్షించారు. గ్రామదేవతగా పూజలందుకుంటున్న ఆరేటమ్మ సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. సాయంత్రం పట్టణ పుర వీధుల్లో అమ్మవార్లను ఊరేగించారు.



పుత్తూరు: అన్నపూర్ణేశ్వరిగా ద్రౌపదీదేవి

నిండ్రలో

నిండ్ర: మండలంలోని కేఆర్ పాళెం గ్రామంలో వెలసిన మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం దుర్గాదేవి అమ్మవారిని ధనలక్ష్మీదేవిగా అలంకరించగా భక్తులు దర్శించుకున్నారు.

సరస్వతీ దేవి అలంకరణలో బంగారమ్మ

కార్వేటినగరం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బంగారమ్మ అమ్మవారు సరస్వతీదేవీ అలంకరణంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఉభయదారులైన ఉదయకుమార్‌శెట్టి కుటుంబ సభ్యులు అమ్మవారికి సమర్పించిన పట్టు వస్త్రాలు, సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించారు. మధ్యాహ్నం మూడు గంటలకు ప్రత్యేక పూజల అనంతరం ఆలయ ఆధ్వర్యంలో 5 ఏళ్లలోపు ఉన్న చిన్నారులకు పలక, బలపం చేతపట్టించి వేదపండితులు శాస్త్రోక్తంగా అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు ప్రసాద్, ఉపాధ్యక్షుడు రంగనాథ మొదలియార్, కార్యదర్శి చంద్రశేఖర్‌పిళ్లై పలువురు భక్తులు పాల్గొన్నారు. మండల పరిధిలోని ఆళత్తూరు గ్రామ సమీపంలో వెలసిన శ్రీముత్యాలమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను గ్రామస్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు. అనంతరం అమ్మవారిని పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.



కార్వేటినగరం: సరస్వతీదేవిగా శ్రీబంగారమ్మ

గంగాధర నెల్లూరులో..

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలో వెలసిన అల్లియల్లమ్మ తల్లి దసరా ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు మహాలక్ష్మిగా గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం అమ్మవారిని ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, ఉభయదారులు, పాల్గొన్నారు. అనంతరం కలవకుంట బాబు, కిరణ్, తులసి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



కార్వేటినగరం: అక్షరాభ్యాసం చేయించడానికి చిన్నారులను తీసుకొచ్చిన తల్లులు

పాలసముద్రంలో..

పాలసముద్రం: మండలంలోని బలిజకండ్రిగ గ్రామంలో వెలసిన చెవుటి గంగమ్మతల్లి, మిద్దినత్తం గ్రామంలో వెలసిన పడవేటమ్మ, నొచ్చిలి గ్రామంలో వెలసిన గిరిరాజ కన్యకా పరమేశ్వరీ సమేత అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పడవేటమ్మతల్లిని లలితాదేవిగా, గిరిరాజ కన్యకా పరమేశ్వరిని శాకాంబరిదేవిగా అలంకరించారు. చెవుటి గంగమ్మతల్లిని వివిధ సుగంధ పుష్పాలతో పుష్పపల్లకిలో అలంకరించగా భక్తులు దర్శించుకున్నారు.

వడమాలపేటలో..

పుత్తూరు రూరల్: వడమాలపేటలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. స్థానికంగా వెలసిన కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం అమ్మవారు లలితా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం లలితా సహస్ర నామార్చనలతో కుంకుమ పూజలు నిర్వహించారు.






పాలసముద్రం: లలితాదేవి అలంకరణలో పడవేటమ్మతల్లి, శాకాంబరిదేవిగా గిరిరాజా కన్యకా పరమేశ్వరి, పుష్పపల్లకిలో చెవుటి గంగమ్మతల్లి, నగరి: కాత్యాయని అలంకరణలో కరుమారియమ్మ










నగరి: అలంకరణలో అన్నపూర్ణాదేవి, సరస్వతీ అలంకరణలో కామాక్షి దేవి, పార్వతీ పరమేశ్వరుల అలంకరణ, పుత్తూరు: సరస్వతీదేవిగా ఆరేటమ్మ, నిండ్ర: ధనలక్ష్మిగా దుర్గాదేవి, ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ, గాజుల అలంకరణలో అల్లియల్లమ్మ, వడమాలపేటలో..

కార్వేటినగరానికి పూర్వ వైభవం తీసుకొస్తా



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

- డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చొరవతో రాజుల కాలం నాటి కట్టడాలకు నిలయమైన కార్వేటినగరం చరిత్రకు పూర్వ వైభవం తీసుకొస్తానని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. శనివారం కుప్పానిగుంట అటవీప్రాంతాన్ని డీఎఫ్‌ఓ చైతన్యకుమార్‌రెడ్డితో కలసి ఎకో టూరిజం ఏర్పాటుకు సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ గతంలో రాజులు అడవిని కొట్టి(తమిళంలో కాడువెట్టి నగరం) నగరంగా ఏర్పాటు చేయడం జరిగిందని, ఇది రాణులు, రాజులు జీవించిన పోతు గడ్డగా పేరొందిన ప్రాంతమన్నారు. అందువల్ల ఈ ప్రాంతాన్ని ప్రభుత్వం చొరవతో నగరం చరిత్రకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. తాను 1972 నుంచి కార్వేటినగరం అభివృద్ధికి శ్రమిస్తున్నానని, అది ఇప్పుడు సాధ్యం అవుతోందని గుర్తు చేశారు. కార్వేటినగరం ప్రాంతంలో ఎకో టూరిజం ఏర్పాటు చేయడం వల్ల దినదినాభివృద్ధి చెంది నియోజకవర్గానికే తలమానికంగా నిలుస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా అభివృద్ధికి జిల్లా కలెక్టర్ సగిలి షణ్మోహన్, డీఎఫ్‌ఓ చైతన్యకుమార్‌రెడ్డి రెండు కళ్లు లాంటి వారన్నారు. వారు రావడంతో నియోజకవర్గంలో ఏడు చోట్ల రోడ్ల ఏర్పాటుకు డీఫారెస్టుగా క్లియరెన్స్‌లు తీసుకురావడం జరిగిందన్నారు. ఎకో టూరిజాన్ని మరింత అభివృద్ధి చేయడానికి ప్రణాళిక సిద్ధం చేయాలని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అదనపు నిధులు మంజూరు చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించండి

కలిగిరి కొండపై శనివారం ట్రాక్టర్ బోల్తా పడి 30 మంది గాయపడ్డారు. ఈ విషయం తెలిసి డిప్యూటీ సీఎం నారాయణస్వామి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం ఆయన చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఫోన్ చేసి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అలాగే ఆదివారం గంగాధర నెల్లూరు మండలం బట్టుకండ్రిగ గ్రామాన్ని సందర్శించి వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. మంత్రి వెంట సర్పంచ్ ధనంజయవర్మ, ఉప సర్పంచ్ శేషాద్రి, ఎంపీటీసీ వెంకటేష్, మాజీ రైతు విభాగం కార్యదర్శి పద్మనాభశెట్టి తదితరులు ఉన్నారు.

గరుడ వాహనంపై లక్ష్మీనారాయణుడు

గంగాధర నెల్లూరు: మండలంలోని వేపంజేరి గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనారాయణస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం అమ్మవారు మోహినీ అవంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతుడైన నారాయణస్వామి వారికి ఆస్థాన మండపంలో ప్రధాన అర్చకులు మాధవన్ వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ తిరుమంజనం సేవ నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించి గరుడ వాహనంపై ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ శ్రీధర్ సుమిత్ర దంపతులు, అడ్వొకేట్ వాసు, మేనేజర్ నల్లా వెంకటేష్ రెడ్డి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పేదలకు రక్షణగా ఆరోగ్య సురక్ష



ప్రసంగిస్తున్న ఎంపీడీఓ శ్రీదేవి

గంగాధర నెల్లూరు: మండలంలోని వరత్తూరు గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును ఎంపీడీఓ శ్రీదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ప్రతి ఒక్కరికీ రాష్ట్రప్రభుత్వం ఉచితంగా గ్రామాల్లోనే స్పెషలిస్ట్ డాక్టర్లచే వైద్యసేవలు అందిస్తోందన్నారు. అలాగే వైద్యపరీక్షలు చేసి మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచిత కంటి అద్దాలు అందజేశారు. మాజీ ఎంపీటీసీ మమత అయ్యప్ప రెడ్డి, గోపాల్ రెడ్డి, డాక్టర్లు పాల్గొన్నారు.

తిరుచ్చిపై ప్రసన్న వెంకన్న వైభవం



ఆలయ మాడవీధుల్లో విహరిస్తున్న శ్రీనివాసుడు

పుత్తూరు రూరల్: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ఊయలలో కొలువుదీర్చారు. భక్తి కీర్తనల నడుమ శ్రీవారి ఊంజల్ సేవ కనుల పండువగా జరిగింది. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరులతో కలిసి తిరుచ్చి వాహనంపై కొలువుదీరారు. మేళతాలాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడ వీధుల్లో విహరించారు. ఈ సందర్భంగా భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులను కటాక్షించి ఆలయానికి చేరుకున్న స్వామి, అమ్మవార్లకు వేద పండితులు మంగళహారతులు ఇచ్చారు. అనంతరం పవలింపు సేవ నిర్వహించారు.

తిరుపతి టౌన్ సర్వీసులుగా 50 విద్యుత్ బస్సులు

తిరుపతి అర్బన్: తిరుపతి నగరంలో త్వరలో 12 మీటర్లు పొడవు కల్గిన (లాంగ్ సర్వీసులు) 50 విద్యుత్ బస్సులను టౌన్ సర్వీసులుగా అందుబాటులోకి తీసుకొస్తామని జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. తిరుమల కొండతోపాటు నెల్లూరు, కడప, మదనపల్లి, రేణిగుంటకు 9మీటర్ల పొడవు కల్గిన ఇప్పటికే 100 విద్యుత్ సర్వీసులను నడుపుతున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. శనివారం తిరుపతి సెంట్రల్ బస్టాండ్ ఆవరణంలో నెడ్‌క్యాప్ సంస్థ ద్వారా గో ఎలక్ట్రిక్ – గో గ్రీన్ కార్యక్రమాన్ని చేపట్టారు. వివిధ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాల కాలుష్యం ఎంతో ప్రమాదమని, కలసికట్టుగా అరికట్టడానికి అంతా విద్యుత్ వాహనాల కొనుగోలుకు మొగ్గు చూపాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులకు సులభ వాయిదాల పద్ధతిలో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలను నెడ్ క్యాప్ సంస్థ ద్వారా అందించడానికి శ్రీకారం చుట్టినట్టు వెల్లడించారు. త్వరలో తిరుపతి నుంచి కోయంబత్తూరు, మధురైకి సర్వీసులు ఏర్పాటు చేస్తామన్నారు. ఈనెల 28, 29 తేదీల్లో తిరుఅణ్ణామలైకు 150 సర్వీసులను ఏర్పాటు చేస్తున్నామని, అందులో 50 ఏసీ బస్సులను పంపుతున్నట్లు వెల్లడించారు. ఆర్టీసీ డెప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, ఏటీఎం రామచంద్రనాయుడు, నెడ్ క్యాప్ జిల్లా మేనేజర్ రామలింగయ్య, డిఓ దిలీప్‌కుమార్ రెడ్డి, సిబ్బంది మానస, క్రాంతి, లావణ్య పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగం మరువలేనిది



ర్యాలీ చేస్తున్న పోలీసులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు

పాలసముద్రం: దేశ రక్షణలో ప్రాణాలను పణంగా పెట్టి మరణిస్తున్న (అమర వీరుల) పోలీసుల త్యాగం మరువలేనిదని జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్, సర్పంచ్ అయ్యప్ప తెలిపారు. శనివారం పాలసముద్రం పోలీస్‌స్టేషన్ ఆవరణలో అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఎస్‌ఐ ప్రసాద్, ఆధ్వర్యంలో నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్ మాట్లాడుతూ ప్రజలంతా ప్రశాంతంగా ఉంటున్నారంటే పోలీసుల రక్షణే అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎండావాన, పగలు, రాత్రి అని తేడా లేకుండా, పండగలు నాడు కూడా కుటుంబాలకు దూరంగా మన కోసం పని చేస్తున్నారని కొనియాడారు. విధి నిర్వహణలో ప్రాణాలను పణంగా పెట్టి మరణిస్తున్న పోలీసుల త్యాగాన్ని మరువలేమన్నారు. అమరవీరుల దినోత్సవంలో మనం భాగస్వాములు కావడం, వారి సేవలను స్మరించుకోవడం, సంతాపం తెలపడం మన విధి అన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్ నుంచి రాచపాళెం వరకు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గోవిందరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రవణానందకరం



మాట్లాడుతున్న ఎల్లా వెంకటేశ్వరరావు

తిరుపతి కల్చరల్: శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో శనివారం రాత్రి పద్మశ్రీ డాక్టర్ ఎల్లా వెంకటేశ్వరరావు ప్రదర్శించిన మృదంగ లయ విన్యాసం శ్రవణానందకరంగా సాగింది. అంతకుముందు ఆయన మాట్లాడుతూ 1961 నుంచి శ్రీవారి సేవలో నిరంతరం పాల్గొనడం తన పూర్వ జన్మ సుకృతమన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలతో పేద ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. తిరుమల శ్రీవారి ఆశీస్సులతో ముఖ్యమంత్రి భవిష్యత్‌లో పేదలకు మరో 18 రత్నాలు అందించాలని ఆకాంక్షించారు. కళాకారుడిగా జీవన పయనం సాగిస్తున్న తాను ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రి గురించి మాట్లాడలేదని, ప్రజలకు సేవ చేసే ముఖ్యమంత్రి గురించి చెప్పడం బాధ్యతగా భావిస్తున్నాని తెలిపారు. శ్రీవారి దయతోనే రెండు సార్లు గిన్నిస్ బుక్ రికార్డులు సాధించానని, నిరంతర కఠోర సాధనతో కొన్ని వేల మంది శిష్యులను తయారు చేయగలిగానని, ఇది ఆ శ్రీవారి కటాక్షమేనని తెలిపారు.

రాష్ట్ర గవర్నర్‌కు సాదర స్వాగతం



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్, ఎస్పీ

రేణిగుంట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు శనివారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. జిల్లా పర్యటన నిమిత్తం రేణిగుంటకు చేరుకున్న ఆయనకు విమానాశ్రయంలో జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, అడిషనల్ ఎస్పీ కులశేఖర్, ఆర్డీఓ కనక నరసారెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు భాస్కర్‌నాయుడు, శ్రీనివాసులు, రేణిగుంట తహసీల్దార్ ఉదయ్‌సంతోష్, డీఎస్పీ భవ్య కిషోర్, ఎయిర్‌పోర్ట్ అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి, స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో తిరుమలకు బయలుదేరి వెళ్లారు. 22వ తేదీ ఉదయం తిరుమలేశుని దర్శించుకుని మధ్యాహ్నం 12 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని, ఇక్కడ నుంచి బెంగళూరుకు వెళ్లనున్నారు.